క్లుప్తంగా

ముగిసిన బ్రహ్మోత్సవాలు


హంస వాహనంపై కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం స్వామి వారికి తీర్థావాది వసంతోత్సవం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు నిర్వహించారు. అనంతరం రాత్రి కొండమీద రాయుడిని సతీసమేతంగా హంస వాహనంపై మండల కేంద్రంలోని పుర వీధులలో ఊరేగించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట


అలంకరణలో పెద్దమ్మ, ఎల్లమ్మ విగ్రహాలు

తాడిపత్రి రూరల్: మండలంలోని ఊరుచింతల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున పెద్దమ్మతల్లి, ఎల్లమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేశారు. విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలకు సీనియర్ న్యాయవాది ఆర్సీ రజనీకాంత్ రెడ్డి దాదాపు రూ.2 లక్షలు ఖర్చు చేశారు. తమిళనాడులోని కంచి నుంచి ప్రత్యేకంగా శిలలను తెప్పించి నంద్యాల జిల్లా కొయిలకుంట్లలో శిల్పులతో పెద్దమ్మ, ఎల్లమ్మ విగ్రహాలను తయారు చేయించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం రేపు

గుత్తి: పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం టౌన్ బ్యాంకు సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంకు సీఈఓ మహేశ్వర ప్రసాద్, బ్యాంకు చైర్మన్ అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11కు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

రీ సర్వే సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్

పెద్దవడుగూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామాల్లోని రైతుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఉషారాణి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రీ సర్వే జరుగుతున్న గ్రామంలో పీజీఆర్ఎస్ పిటిషన్లు పరిష్కారం చేస్తే రైతులకు ఎలాంటి సమస్యలు రావన్నారు. దిమ్మగుడిలో ప్రతి రైతుకూ నోటీసులు జారీ చేసి రీ సర్వే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామ సభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వరమ్మ, ఆర్ఐ, వీఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఓపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు రూరల్: ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న భూషణంపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కమిటీ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ కార్యాలయంలో పనిచేసే మహిళా సిబ్బందితో ఆఫీసు రూములు, పరిసరాలతోపాటు, మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, అధికారుల తిన్న భోజనం ప్లేట్లను శుభ్రం చేయించడం తదితర పనులు చేయిస్తూ మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారన్నా. వెంటనే ఏఓపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సరస్వతీ విద్యా మందిరానికి విరాళం


రూ.5 లక్షల విరాళం అందజేస్తున్న దాతలు

పామిడి: పట్టణంలోని తలవాలకట్టవీధిలోని నిట్టూరు నిలయం సరస్వతీ విద్యామందిరం నూతన భవన నిర్మాణానికి దాతలు కే సాయి ప్రకాష్, కే విశ్వనాథ్ రూ.5 లక్షలు విరాళం అందజేశారు. ఈసందర్భంగా దాతలను స్కూల్‌కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం తులసీబాయి, స్కూల్ కమిటీ సభ్యులు బొల్లు శ్రీనివాసరెడ్డి, రాజేంద్రప్రసాద్, బసవరాజు, చంద్రశేఖర్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- గుత్తి, గుంతకల్లులో ఘన స్వాగతం


గుంతకల్లులో వైవీఆర్‌కు క్రేన్‌తో గజమాల వేస్తున్న దృశ్యం



గుత్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లుకు భారీ కాన్వాయ్‌తో వెళ్తున్న వైవీఆర్

గుత్తి/గుత్తి రూరల్/గుంతకల్లు: కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి అన్నారు. అనారోగ్యం నుంచి కోలుకుని శుక్రవారం హైదరాబాద్ నుంచి గుంతకల్లుకు వచ్చారు. ఈ సందర్భంగా గుత్తిలో ఆయనకు వేలాది మంది పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్లు, బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. . జై జగన్..జై వైవీఆర్ నినాదాలతో హోరెత్తించారు. గుత్తి పట్టణంలోని రాయల్ సర్కిల్ వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ జగన్‌పై పాటలకు పార్టీ కార్యకర్తలు డాన్స్‌తో హోరెత్తించారు. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్‌లో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఎవరికీ భయపడద్దన్నారు. తాను అండగా ఉంటానన్నారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ కార్యకర్తలను వదలనన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా పరిష్కారానికి తాను ముందు ఉంటానన్నారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన గుత్తి, గుత్తి రూరల్, గుంతకల్లు గుంతకల్లు రూరల్, పామిడి, పామిడి రూరల్ కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యకర్తల కోరిక మేరకు తగ్గేదే లే అంటూ మీసాలు మెలేశారు. అలాగే గుత్తి మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో మాజీ ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బాట సుంకులమ్మ ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టారు. అనంతరం బాట సుంకులమ్మ ఆలయం వద్ద పార్టీ శ్రేణులను ఉద్దేశించి వైవీఆర్ మాట్లాడారు. నాపై చూపించే అభిమానం, ఆప్యాయత ఎప్పటికీ ఇలాగే ఉండాలన్నారు. అధికార పార్టీ ఆగడాలను అందరూ కలిసి కట్టుగా ఎదుర్కొందామన్నారు. అధికార పార్టీ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తే తాము పూర్తి సహకారం అందిస్తామని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే దీటుగా జవాబిస్తామన్నారు. అధికార పార్టీ వైఫల్యాలను అందరూ కలిసికట్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు ఎండగడుతామన్నారు. అనంతరం గుంతకల్లుకు చేరుకున్న ఆయనకు పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో క్రేన్ సాయంతో అభిమానులు భారీ గజమాల వేశారు. సభలో వైవీఆర్ మాట్లాడుతూ బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని, ఎన్నికలెప్పుడొచ్చినా మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, వైస్ చైర్పర్సన్ మైమూన్, ఎంపీపీ విశాలాక్షి, వైస్ చైర్మన్ వరలక్ష్మి, గుత్తి పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, గుంతకల్లు పట్టణ, మండల అధ్యక్షులు ఎండీఆర్.ఖలీల్, రాము, నాయకులు గురుప్రసాద్‌యాదవ్, రాజ్‌కుమార్ రెడ్డి, వై.రామసుబ్బారెడ్డి, కృష్ణమోహన్‌నాయుడు, కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, కౌన్సిలర్లు ఫరూక్, వరదరాజులు, శివ, నజీర్, నాయకులు రామయాదవ్, పుల్లారెడ్డి, పీరా, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్, హరినాథ్‌రెడ్డి, కరిడికొండ సర్పంచ్ రమేష్‌నాయుడు, లచ్చానుపల్లి, ఇసురాళ్లపల్లి సర్పంచ్ గోపాల్, వాసుదేవరెడ్డి, కొత్తపల్లి చంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఉపేంద్రరెడ్డి , వైస్ ఎంపీపీ ప్రభావతి, మాజీ చైర్మన్ జింకల రామాంజినేయులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆలూరుకు జగనన్న ఆశీస్సులు


మాజీ సీఎం వైఎస్ జగన్ ఆశీర్వాదం తీసుకుంటున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి జన్మదినం పురస్కరించుకుని, బెంగుళూరులో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో ప్రజా సేవలో మరింత అంకితభావంతో ముందుకుసాగుతానన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షుడు రఘువీర్ శుక్రవారం తెలిపారు. శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ నిర్వహిస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ జిరాక్స్, రెండు ఫోటోలు తెచ్చుకోవాలన్నారు. అవకాశాన్ని మండల, మండలేతర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

'భూమిని మరొకరి పేరు మీద రికార్డుల్లో ఎక్కించారు'

శింగనమల: మా పూర్వీకుల నుంచి అనుభవంలో ఉన్న భూమిని రీసర్వేలో మిగులు భూమి చూపి, మరొకరి పేరు మీద రెవెన్యూ రికార్డులలో ఎక్కించారని, మాకు న్యాయం చేయాలని శింగనమల మండలం వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన రైతు పురుషోత్తం రెడ్డి శుక్రవారం గార్లదిన్నెలో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించుకున్నారు. రైతు మాట్లాడుతూ మాకు మండలంలోని చెన్నవరం రెవెన్యూలో సర్వే నంబరు 129లో 8.54 ఎకరాలు భూమి ఉందన్నారు. 2023లో రీ సర్వే జరిగిన సమయంలో మాకు 6.07 ఎకరాలు ఉంచి, మిగిలిన భూమిని మిగులుగా చూపారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు పలు మార్లు విన్నవించుకున్నామన్నారు. ఈ సర్వే నంబరు అంత జాయింట్ ఎల్‌పీఎంగా నమోదు చేశారన్నారు. దీనిపై మాకు రెవెన్యూధికారులు సమాచారం ఇవ్వకుండా, ఎటువంటి నోటీసు ఇవ్వకుండా , వెబ్ ల్యాండ్‌లో మాభూమిని తగ్గించి, మరొక వ్యక్తిపై , ఎటువంటి డాక్యుమెంట్ లేకుండా వెబ్ ల్యాండ్ నందు నమోదు చేశారని, దీనిపై విచారణ చేసి, న్యాయం చేయాలని కోరారు.

నేడు ఇంటర్ ప్రాక్టికల్స్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించే ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం చేసినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలో ఎంపీసీ, బైపీసీ, ఒకేషినల్ విద్యార్థులు 170 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి


తాడిపత్రిలో నినాదాలు చేస్తున్న నాయకులు


గుంతకల్లులో నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్/గుంతకల్లు రూరల్: దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలు మరువలేనివని వక్తలు కొనియాడారు. తాడిపత్రి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు 2019 ఫిబ్రవరి 14న పుల్వామాల్లో పాకిస్తాన్ దాడిలో అమరులైన 40 మంది వీరజవాన్‌లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు భారత్‌మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేషానందరెడ్డి, కృష్ణమోహన్, లక్ష్మీనారాయణ, రాంబాబు, గంగాధర్, నారాయణస్వామి, వీరభద్రయ్య, సుధాకర్, శివారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులోని శ్రీశంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో వీరజవాన్‌లకు నివాళుర్పించారు. ప్రిన్సిపాల్ గోపాల్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జీ ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌బాబు, అధ్యాపకులు వెంకటరమణ, బసెట్టి క్రిష్ణయ్య, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్ వేడుక చూద్దాం


రామాలయం

- 17న రామకోటి తిరునాల
- నేడు అన్నదానం

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటికాలనీలో మాఘ మాసం మూడో సోమవారం తిరునాల నిర్వహించనున్నారు. తిరునాల సందర్భంగా శనివారం కాలనీవాసులు అన్నదాన కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. వందేళ్ల క్రితం ఓబులదాసు అనే నేత కార్మికుడు రామకోటి రాసి, వాటిని భద్రాచలంలో అప్పగించారు. ఆ శుభ సందర్భంగా రామాలయాలన్ని నిర్మించి అందులో సీతారాములతో పాటు నరసింహస్వామి, వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్టింపజేశారు. అప్పటి నుంచి మాఘమాసం మూడో సోమవారం తిరునాల నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. తిరునాలకు పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణం చేసిన వారి వంశీకుల పరిస్థితి బాగలేకపోవడంతో కాలనీవాసులు చందాలు పోగు చేసి తిరునాల నిర్వహించనున్నారు.


సీతారాములు


నరసింహస్వామి


వేంకటేశ్వరస్వామి

రోడ్డు భద్రతపై అవగాహన


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ గౌస్‌బాషా

తాడిపత్రిటౌన్: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ పోలీసులు ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ గౌస్‌బాషా మాట్లాడుతూ ఆటోల్లో పరిమితి మించి ప్రయాణికులను తరలించొద్దన్నారు. డ్రైవర్ ప్రక్కన ప్రయాణికులను కూర్చోనీయకూడదన్నారు. పెద్ద స్పీకర్ల కారణంగా వెనుక వైపు వచ్చే వాహనాల హారన్‌లు వినిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లకు లైసెన్స్‌లు ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ప్రాంతంలో ఆటో డ్రైవర్లు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ఆర్టీఓకు అప్పగిస్తామని శుక్రవారం మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేయిస్తామన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు


ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

శింగనమల: అనంతపురం-విజయవాడ రహదారి నిర్మాణ పనుల సందర్భంగా పైపులైన్లు దెబ్బతినడంతో పాటు టీడీపీ నాయకులు కొంతమంది మెయిన్ పైపులైన్‌కు కొళాయిల కనెక్షన్లు తీసుకోవడంతో నెల రోజులుగా సి.బండమీదపల్లిలో తాగునీటి సమస్య ఏర్పడింది. సచివాలయ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు శుక్రవారం అనంతపురం-విజయవాడ రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. గంటపాటు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. వెంటనే ఈఓఆర్డీ వెంకటలక్ష్మమ్మ, పంచాయతీ సిబ్బంది, ఎస్ఐ విజయకుమార్, వారి సిబ్బంది వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తాత్కాలికంగా ట్యాంకర్‌ను పంపించి నీటి సమస్య తీర్చారు. కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తామని, అంతవరకు ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తామని చెప్పారు.

తొండపాడు హుండీ ఆదాయం రూ.9.40 లక్షలు


హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో ఉన్న బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎనిమిది రోజుల పాటు ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హుండీలను శుక్రవారం దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదిశేషనాయుడు, ఈఓ రామాంజనేయులు సమక్షంలో లెక్కించగా రూ.9.40.590 ఆదాయం వచ్చింది. వచ్చిన ఆదాయాన్ని దేవదాయశాఖ ఖాతాకు జమ చేస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రంగస్వామిరెడ్డి యాదవ్, దేగా మద్దిలేటి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ పాల్గొన్నారు. ఎస్ఐ సురేష్ బందోబస్తు నిర్వహించారు.

లోక్ అదాలత్‌పై నేడు సమావేశం

తాడిపత్రి రూరల్: స్థానిక కోర్టులో శనివారం తాడిపత్రి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణవేణి అధ్యక్షతన లోక్ అదాలత్ కార్యక్రమ నిర్వహణపై న్యాయవాదులతో సమావేశం నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మట్కా నిర్వాహకుడు అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన పాలమాబు పట్టణంలోని నందలపాడు వద్ద ఉన్న సాయిబాబా ఆలయం వద్ద మట్కా రాస్తుండగా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.71,770 నగదుతోపాటు మట్కా పటీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా మండలంలోని కోనరోడ్డు రహదారిలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శుక్రవారం సాయంత్రం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7,100 స్వాధీనం చేసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని నాయీబ్రాహ్మణ కాలనీ, చేనేత కాలనీల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో రెండు కాలనీల్లోని అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు తీసుకునే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున స్థలాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగరంగయ్య, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన అవసరం


అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ షాజిదాబేగం

యాడికి: కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన అవసరమని తాడిపత్రి సీడీపీఓ షాజిదాభేగం సూచించారు. శుక్రవారం మండల కేంద్రం లోని నంబర్ 1, 3 అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేయకపోవడంపై విచారణ

యల్లనూరు: మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో రేషన్ సక్రమంగా వేయడం లేదని గ్రామస్తులు విన్నవించుకోవడంతో శుక్రవారం తహసీల్దార్ రాజా, ఆర్ఐ నారాయణమ్మ గ్రామంలో విచారణ చేపట్టారు . డీలరు ఒకటి, రెండు రోజులు సరుకులు వేసి, ఆ తరువాత వేయడం లేదన్నారు. బియ్యం కోసం వెళ్లినప్పుడు బియ్యం అయిపోయాయని, మళ్లీ వేస్తామని వేలిముద్రలు తీసుకుంటున్నారన్నారు. డీలర్‌పై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

పెద్దవడుగూరు: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యను ప్రతి ఒక్కరూ స్ఫూర్తి గా తీసుకొని ముందుకు సాగాలని ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో సంజీవయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ పుల్లారెడ్డి, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం

గుత్తి: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని వామ పక్షాల నాయకులు ఆరోపించారు. గుత్తిలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు రాందాస్, నిర్మల మాట్లాడారు. ఏపీకి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అన్యాయం చేసినా కూటమి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఏపీకి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మేమింతే.. మారమంతే


సలకంచెరువు వద్ద వంకలో ట్రాక్టర్‌లోకి ఇసుక నింపుతున్న జేసీబీ

- నలకంచెరువు సమీపంలోని వంక నుంచి ఇసుక తరలిస్తున్న టీడీపీ నాయకులు

శింగనమల: మండలంలోని నలకంచెరువు సమీపంలో ఉన్న వంక నుంచి ఇసుకను టీడీపీ నాయకులు అక్రమంగా తరలిస్తుండడంతో రెవెన్యూ అధికారులు ఇసుక డంప్‌లను సీజ్ చేయడం, ఆతరువాత ఒక టీడీపీ నాయకుడు వీఆర్వోను బెదిరించిన మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో కేసు నమోదు చేశారు. ఆ సమస్య ముగిసి 10 రోజులు కూడా గడవకనే మరో టీడీపీ నేత ఆదే వంకలో అక్రమంగా జేసీబీ పెట్టి , ఇసుకను ట్రాక్టర్ల ద్వారా డంప్‌కు తరలించి, అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు షేర్ చేశారు. రెండు రోజుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలిసింది. టీడీపీ నాయకులను అధికారులు అరెస్టు చేసి కేసులు పెడుతున్నా.. ఇసుక అక్రమ తరలింపు మాత్రం ఆపడం లేదు. అక్రమంగా ఇసుక తరలించి సొమ్ము చేసుకోవడం అధికార పార్టీ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది. రెవెన్యూ, మైనింగ్, పోలీసులు స్పందించి ఇసుక అక్రమంగా తరలించకుండా గట్టి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.